క్లుప్తంగా

శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ



భూహక్కు పత్రాలు అందిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఉదయగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా భూ రీసర్వే పూర్తికావడంతో శుక్రవారం మండలంలోని శకునాలపల్లి పంచాయతీలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి భూ యజమానులకు శాశ్వత భూహక్కు పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామాల్లో భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పంచాయతీలో రీసర్వే పూర్తయిందన్నారు. ఇకపై ఎలాంటి భూ సమస్యలకు తావుండదన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ అనూష పాల్గొన్నారు.

సమర్థవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష



ఇంటి వద్దనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అస్మా తెలిపారు. శుక్రవారం 4వ వార్డు పరిధిలో ఆరోగ్య సిబ్బంది, డాక్టర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మావతి, ఆశ కార్యకర్తలు జబీనా, మహబూబ్‌జానీ పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన

వింజమూరు (ఉదయగిరి): జీవన విధానంలో మార్పులు, మంచి ఆహారం తీసుకోవడం ద్వారా సాంక్రమిక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని ప్రముఖ వైద్యులు మాశిలామణి అన్నారు. ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవం వింజమూరులో 'గుండె వ్యాధులు–తీసుకోవాల్సిన ముందుస్తు జాగ్రత్తలు' అంశంపై అవగహన కార్యక్రమం జరిగింది. పలువురు గుండెవ్యాధుల పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు వివేక, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

రక్తపు మరకల కలకలం



బొటికర్లపాడు-పడకండ్ల తారురోడ్డుపై రక్తపు మరకలు

ఆత్మకూరు రూరల్: మండలంలోని బొటికర్లపాడు-పడకండ్ల మధ్య తారు రోడ్డుపై రక్తపు మరకలు ఉండడాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. ఈ విషయం ఆ నోటా, ఈ నోటా పరిసర గ్రామాల్లో ప్రచారం కావడంతో ఏమి జరిగిందోనని ఎవరికి వారు ఆందోళన చెందారు. పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినట్లు ఆధారాలు లభించలేదు. ఈ విషయమై ఆత్మకూరు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ముత్యాలరావుని సంప్రదించగా రక్తపు మరకలకు సంబంధించి తమకు ఆధారాలేవి లభించలేదని తెలిపారు.

నెరవేరిన రైతుల కల



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి జనార్దన్‌రెడ్డి కృతజ్ఞతలు

చేజర్ల(సోమశిల): ఎన్నో సంవత్సరాల నుంచి పొలాల్లోకి రోడ్డు మార్గం లేక రైతులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. అనంతసాగరంలో రైతులు తమ పొలాల్లోకి పోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రహదారి వసతి లేక గత సంవత్సరం పైరు పెట్టక రైతులు ఇబ్బందులు పడినట్లు వివరించారు. దాదాపు కిలో మీటరు మేర రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రహదారిని ఏర్పాటు చేయడంతో రైతులు పొలాలకు పోవడానికి సులభంగా ఉందన్నారు. ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనులు చేసుకొంటున్నారన్నారు.

రాష్ట్ర రెవెన్యూ కౌన్సిల్ జయప్రదం చేయండి

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం విజయవాడలో జరగనుందని, ఈ సమావేశాన్ని రెవెన్యూ ఉద్యోగులు జయప్రదం చేయాలని ఆత్మకూరు తాలుకా రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయం వద్ద సమావేశమైన ముఖ్య కార్యవర్గ సభ్యులు ఆదివారం సమావేశానికి హాజరయ్యే ఏర్పాట్లపై చర్చించారు. శనివారం రాత్రి ఆత్మకూరు తాలుకా నుంచి 40 మంది రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి జి సాయి ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శేషయ్య, ఆర్ఐ పృథ్వీరాజ్, వీఆర్ఓలు కృష్ణయ్య, హజరత్తయ్య, బాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- నియోజకవర్గంలో 100 పైగా మెడికల్ క్యాంపులు



కావలి మండలం తుమ్మలపెంటలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

కావలి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అందరికీ ఆరోగ్యం కల్పించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభమవుతోంది. నియోజకవర్గంలోని కావలి పట్టణం, కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో 45 రోజుల పాటు జరగనున్న కార్యక్రమంలో 100కు పైగా మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. శనివారం అల్లూరు మండలం ఇస్కపల్లి, బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు, కావలి మండలం ఆనెమడుగు గ్రామాల్లో మెడికల్ క్యాంపులతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి ఒక్కరికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి నయం అయ్యే వరకు వైద్యశాఖ తోడుగా ఉంటుంది. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్న అధికారులు, ఒక డాక్టర్ పీహెచ్‌సీలో ఉంటే ఇంకో డాక్టర్ అంబులెన్స్‌లో గ్రామాల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో కావలి పట్టణంలోని రాజీవ్‌నగర్, వెంగళరావుగనగర్ అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు బోగోలు మండలం కోవూరుపల్లి, కావలి మండలం సర్వాయపాళెం, తుమ్మలపెంట, అల్లూరు మండలంలోని ఇస్కపల్లి, దగదర్తి మండలంలోని దగదర్తి పీహెచ్‌సీల పరిధిలో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో కలిసి వలంటీర్లు బృందాలుగా ఏర్పడి 2,16,577 మందికి పరీక్షలు చేశారు.

క్యాంపుల ప్రత్యేకత

ఈ మెడికల్ క్యాంపుల్లో 162 రకాల మందులతో పాటు 18 రకాల శస్త్ర చికిత్సల వస్తువులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు తదితరాలను అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలున్న వారిని వైద్యులు పరీక్షిస్తారు. అవసరమైన వారికి ఈసీజీ వంటి వైద్య పరీక్షలు కూడా చేసి ఉచితంగా మందులిస్తారు. ఎవరికైనా పెద్ద చికిత్సలు అవసరమైతే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రిఫర్ చేస్తారు. ఇంటింటి సర్వే నిర్వహణ సమయంలో సాధారణ వాటితో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువులేని పిల్లలు, క్షయ, కుష్ఠు వ్యాధులు కలిగిన వారు ఉంటే ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఇంట్లో ఎవరు ఎలాంటి ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారో గుర్తిస్తారు. గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లు ద్వారా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి అవసరమైన పరీక్షలు చేయడం పాటు మందులు, కంటి పరీక్షలను కూడా క్యాంపులో భాగంగా చేసి కళ్లద్దాలు అందిస్తారు. క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు వంటి దీర్ఘకాలిక జబ్బుల బాధితులను (క్రానిక్ డిసీజెస్) గుర్తించి వైద్యం అందించనున్నారు. ఒక వైపు సరైన సమయంలో చికిత్స అందిస్తూనే జీవన విధానాల్లో తీసుకోవాల్సిన మార్పులు, ఆయా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై (ప్రివెంటివ్ కేర్) ప్రజల్లో అవగాహన పెంపొందించనున్నారు.

బాధ్యతగా ఆరోగ్య సురక్ష నిర్వహించాలి

- కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక

పరికుంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణను సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని గణేశ్వరాపురంలో శనివారం జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆమె మాట్లాడుతూ శిబిరానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సిబ్బంది సకాలంలో శిబిరానికి హాజరై ఉండాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి శిబిరాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పద్మజా, ఎంపీడీఓ శ్రీదేవి, మండల వైద్యాధికారులు కరిష్మా, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్లు పరిశీలన

కొండాపురం: మండలంలోని సాయిపేట జెడ్పీ పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాట్లును కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకునే వారికి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ బ్రహ్మయ్య, స్థానిక పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, వీఆర్వో ప్రసాదరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శోభిక

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం



గొట్టిగుండాలలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గొట్టిగొండాలలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి రాజగోపాల్‌రెడ్డి చేరుకోగానే స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మేళతాళాల నడుమ, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మేకపాటి అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా చేకూరిన పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేసి వారి అభివృద్ధికి పాటు పడుతున్నాడన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పనులు చేసే ప్రభుత్వం, పేదవారి కష్టాలు తీర్చే ప్రభుత్వమన్నారు. జగనన్న కాలనీలు, పక్కా ఇళ్లు, అమ్మఒడి, ఆర్థిక భరోసా, రైతు భరోసా, సామాజిక పింఛన్లు తదితర పథకాలతో పాటు రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలను గ్రామాల్లోనే అందిస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, తదితర పథకాలతో పేదింటి పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో టీడీపీ రాష్ట్రంలో కనిపించకుండా పోతుందన్నారు. ఈ రోజు వాహనమిత్ర పథకం ద్వారా విజయవాడ విద్యాధరపురం నుంచి ముఖ్యమంత్రి బటన్ నొక్కి 2,75, 931 మంది వాహనదారులకు రూ.10 వేల చొప్పున రూ. 275.93 కోట్లను అందించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ప్రజలు ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర, స్థానిక ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ డబ్బుగొట్టు కొండాలరావు, గరిమెనపెంట సొసైటీ డైరెక్టర్లు తిమ్మారెడ్డి రమణారెడ్డి, పిన్నిక కొండయ్య, మాజీ ఎంపీటీసీలు శీలం మల్లికార్జునరెడ్డి, బొడ్డు మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.కమలాకర్, నల్లబోతు శ్రీనివాసులు, వసంతరావు, గోరంట్ల నరసింహులు, చింతలదేవి ఎంపీటీసీ కొండలరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కావలి అధ్యక్షుల నియామకం



కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి



జంపాని రాఘవులు



తాళ్లూరు ప్రసాద్‌నాయుడు



మద్దిబోయిన వీరరఘు



దండా కృష్ణారెడ్డి



బీద రమేష్

కావలి: కావలి నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాల అధ్యక్షుల నియామకాలను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. కావలి పట్టణ అధ్యక్షుడిగా కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, అల్లూరు పట్టణ అధ్యక్షుడిగా దండా కృష్ణారెడ్డి, కావలిరూరల్ మండల అధ్యక్షుడిగా జంపాని రాఘవులు, బోగోలు మండల అధ్యక్షుడిగా మద్దిబోయిన వీరరఘు, దగదర్తి మండల అధ్యక్షుడిగా తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, అల్లూరు రూరల్ మండల అధ్యక్షుడిగా బీద రమేష్‌ను నియమించింది.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు



చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి



బొర్రా వెంకట సుబ్బారెడ్డి



అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి



రాపూరు వెంకట సుబ్బారెడ్డి



తూమాటి విజయభాస్కర్ రెడ్డి



పందిళ్లపల్లి సుబ్బారెడ్డి



పులగం శంకర్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించింది. ఆత్మకూరురూరల్ మండల అధ్యక్షుడిగా చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి, మర్రిపాడు మండల అధ్యక్షుడిగా బొర్రా వెంకట సుబ్బారెడ్డిలను నియమించింది. అనంతసాగరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా రాపూరు వెంకటసుబ్బారెడ్డి, చేజర్ల మండల అధ్యక్షుడిగా తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, ఏఎస్‌పేట మండల అధ్యక్షుడిగా పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, సంగం మండల అధ్యక్షుడిగా పులగం శంకర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడిగా అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అధ్యక్షులు వీరే



గానుగపెంట ఓబుల్‌రెడ్డి



చింతంరెడ్డి సుబ్బారెడ్డి



దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి



చేవూరు జనార్దన్‌రెడ్డి



కాటం రవీంద్రారెడ్డి



చిమ్మిలి రవీంద్ర



అంద్రా బాలగురవారెడ్డి



రేవునూరి శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి నియోజవర్గంలోని ఎనిమిది మండలాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమిస్తూ జాబితా శుక్రవారం విడుదల చేసింది. ఉదయగిరి మండల అధ్యక్షుడిగా గానుగపెంట ఓబులరెడ్డి, వరికుంటపాడుకు అంద్రా బాలగురువారెడ్డి, దుత్తలూరు డీ వాసుదేవరెడ్డి, వింజమూరు రేవునూరు శ్రీనివాసరెడ్డి, సీతారామపురం చింతంరెడ్డి సుబ్బారెడ్డి, కలిగిరి కాటం రవీంద్రరెడ్డి, జలదంకి చేవూరు జనార్దన్‌రెడ్డి, కొండాపురానికి చిమ్మిలి రవీంద్రలను నియమించారు.

పురోగతి లేకపోతే సహించేది లేదు

- మెప్మా పీడీ రవీంద్ర



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

కావలి: జగనన్న కాలనీల్లో పురోగతి లేకపోతే సహించేది లేదని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రవీంద్ర హెచ్చరించారు. స్థానిక రైల్వే రోడ్‌లోని మెప్మా కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్, సిటీ మిషన్ మేనేజర్‌తో మెప్మా పీడీ రవీంద్ర శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బ్యాంకు పాయింట్ పర్సన్‌తో సమీక్షించానన్నారు. జగనన్న కాలనీలు, ఏపీటీఐడీసీఓ హౌసింగ్‌లో కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సమీక్షించారన్నారు. జగనన్న కాలనీలో ప్రతి ఆర్‌పీ ప్రతి సభ్యురాలు రూ.35 వేలు కట్టించి త్వరితగతిన ఇల్లు కట్టించాలన్నారు. వాటిపై సందేహాలు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో సిటీ మిషన్ మేనేజర్ భారతి, సీఓలు కొండయ్య, అరుణ కుమారి, ఝాన్సీ లక్ష్మి, సునీత, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారి తనంగా పనిచేయాలి

- డ్వామా అడిషనల్ పీడీ సుజాత



మాట్లాడుతున్న సుజాత

ఉదయగిరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ సిబ్బంది ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారితనంగా పని చేయాలని డ్వామా అడిషనల్ పీడీ సుజాత అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లేబర్ బడ్జెట్‌ను రూపొందించుకోవాలన్నారు. రాబోయే రెండేళ్లకు సంబంధించి ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులను గుర్తించి గ్రామ సభల ద్వారా వాటిని ఆమోదించి ప్రతిపాదించాలన్నారు. కార్యాలయంలో రికార్డుల నిర్వాహణ ఫైలింగ్ సక్రమంగా లేకపోవడం గుర్తించి సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం విడనాడాలన్నారు. ఏపీఓల పర్యవేక్షణ సక్రమంగా లేదన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహిస్తూ కేటాయించిన లక్ష్యాలు నూరు శాతం సాధించాలన్నారు. కూలీలకు కొలతల ప్రకారం పనులు కేటాయించి, గిట్టుబాటు కూలీ నగదు పొందేలా చూడాలన్నారు. పనులను ఏపీఓ, ఈసీ, టీఏలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ బి.శ్రీనివాసులు ఈసీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్వామా అడిషనల్ పీడీకి సన్మానం

స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం డ్వామా అడిషనల్ పీడీ సుజాతను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గానుగపంట ఓబుల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు విన్నవించారు. మెట్ట ప్రాంతంలో ఉపాధి పనులు ఎక్కువ శాతం చేపట్టేందుకు అధిక నిధులు కేటాయించేలా చూడాలని ఆమెను కోరారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, దాసరిపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఖాళీలు ఉన్నాయని అర్హులు (మహిళలు మాత్రమే) దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రజిత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఇంగ్లిష్ మీడియంలో బోధన చేయడానికి గణితం, ఫిజికల్ సైన్స్ తదితర ఉపాధ్యాయ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ అర్హత కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు అక్టోబరు 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయన్నారు.

రెండు లారీలు ఢీ

- ఒకరి దుర్మరణం



లారీలో మృతి చెందిన చిరంజీవి

కావలి: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన కావలి మండలం మద్దూరుపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు నెల్లూరుకు చెందిన లారీ రొయ్యల మేత కోసం భీమవరం వెళ్లి అక్కడి నుంచి మేతతో తిరిగి వస్తుండగా మద్దూరుపాడు వద్దకు వచ్చేసరికి ప్రమాదానికి గురైంది. వేకువ సమయంలో మద్దూరుపాడు బ్రిడ్జి వద్ద ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా వేగాన్ని తగ్గించడంతో వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా లారీలో మేత లోడింగ్ కోసం కూలీగా వెళ్లిన గూడూరు ఎస్సీ కాలనీకి చెందిన చిరంజీవి (41) తీవ్రంగా గాయపడి లారీలోనే మృతి చెందాడు. లారీ డ్రైవర్ కృష్ణమూర్తి, మరో కూలీ చెన్నకేశవులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

గృహ నిర్మాణాలను పరిశీలించిన డీఈ



సంగం: సంగంలో కొండ వద్ద జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం గృహ నిర్మాణశాఖ డీఈ శ్రీహరిగోపాల్ పరిశీలించారు. పనుల జరుగుతున్న తీరును పరిశీలించి, నాణ్యతలో తేడా లేకుండా నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కరిముల్లా, సిబ్బంది, కాంట్రాక్టర్ రసూల్ ఉన్నారు.

ఊరూరా నా భూమి నా దేశం



కరటంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు



కలిగిరి: జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల పాఠశాలల్లో శుక్రవారం ముమ్మరంగా నా భూమి నా దేశం కార్యక్రమాలు నిర్వహించారు. అమృత్ కలశాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి మట్టిని సేకరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఢిల్లీలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్మారకార్థం నిర్మించే స్థూపం వద్ద దేశ వ్యాప్తంగా సేకరించిన మట్టిని వినియోగిస్తారన్నారు. మండలంలోని కరటంపాడు, బట్టేపాడు, పేరారెడ్డిపల్లి, మురగళ్ల, దేపూరు, బోయిలచిరివెళ్ల, మహిమలూరు తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, దేశ నాయకుల చిత్రపటాలతో వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు.

మోడల్ స్కూల్‌లో అమృత్ కలశయాత్ర

కలిగిరి: కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం అమృత కలశయాత్ర నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా మట్టిని సేకరించారు. కలశాన్ని సంప్రదాయబద్ధంగా అలంకరించి అందులో భద్రపరిచారు. అమృత్ కలశాన్ని మండల విద్యావనరుల కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీను, వైస్ ప్రిన్సిపల్ కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3న మండల సమావేశం

అనుమసముద్రంపేట: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అధ్యక్షతన అక్టోబర్ 3న మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సభ్యులు చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం

- జేసీ రోణంకి కూర్మనాథ్



అర్జీని పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

కావలి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్జీదారులు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జేసీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శుక్రవారం కావలి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో జేసీ పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు అందజేసి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రానికి రాలేని గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించిన తరువాత సీఎం కార్యాలయం నుంచి ప్రతి అర్జీదారుడికి ఫోన్ చేసి సంతృప్తి చెందారో..లేదో తెలుసుకుంటున్నారని చెప్పారు. జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి, నుడా వీసీ బాపిరెడ్డి, ఆర్డీఓ వీకే శీనానాయక్, తహసీల్దార్ కే మాధవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.